# సేవాధర్మం

'కరుణకుమార'

అనుకున్న ప్రకారం తకీలున, జనవరి నెల ౨౬ తేదీ సోమవారం ఉదయం ఎనిమిది గంటలరైలులో దిగి, టాక్సీమీద ఇంటికి వచ్చాడు — హాతీసింగు. ముందు హాతీసింగు టాక్సీకారూ, ఆ వెనక మోటారులారీలో అతని సామానూ, రెండూ ఒకదాని వెనక మరొకటి ఇంటి కాంపౌండులోకి వెళ్లి గుమ్మం ఎదురుగ్గా నిలబడినవి.

ఆరడుగుల ఎత్తు ఆజానుబాహువు మనిషి! ఎర్రగా కందగడ్డలాంటి ముఖం, ముఖంలో పైకి ఉబికిన కోడిగ్రుడ్డులంతటి ఎర్రజీరగల చారెడేసినేత్రాలు, తీక్ష్ణమైన కనుబొమలు, నిశితమైన నాశిక, బిరుసెక్కిన రాగివెంట్రుకల బుగ్గమీసం, ఖాకీ మిలిటరీ సూటూ, మోకాలివరకూ కప్పివేసిన ఫుల్ బూటూ, నెత్తిన రాజపుత్రపాగా, నడుముకీ మెడలోనూ జందెంపెట్టుగా తోలుబెల్టూ — అచ్చం యుద్ధభూమిలో ఉరకడానికి తయారయిన యోధుడులాగా, మోటారులోనుండి బయటికి వచ్చి వరండా ఎక్కాడు — హాతీసింగు. భార్య రూపరాణి మొఖంలో అంత ఉత్సాహమూ, ఆనందమూ వెల్లివిరియక పోయినా పెదవులమీది చిరునవ్వుతో భర్త కాప్యాయంగానే స్వాగతం ఇచ్చింది.

కాని కొడుకు రామసింగుమాత్రం కనపడడు!

వరాండాలో నిలబడి కాంపౌండు ఆవరణ నాలుగుమూలలూ కలయచూచాడు సింగు. ఓ అయిదేళ్ల క్రిందటి స్థలం లాగా లేదు. అప్పటి చిన్నచిన్న లేతమొక్కలు ఇప్పుడు పెరిగి పెద్దవై విర్రవీగిపోతున్నవి. మరి తన లేతకొడుకు రామసింగు ఇప్పటికి ఎంతఎత్తు పెరిగినాడో! అతనిఛాతీ ఎన్ని అంగుళాలు వికసించిందో!

కొత్తరకం పూలచెట్లూ ఫలవృక్షాలూ చాలా బయల్దేరినవి ఆవరణలో. తలపైకెత్తి ఇల్లూ, హాలూ, మిద్దె నాలుగువంకలా పరకాయించి చూచుకున్నాడు. తృప్తిపడ్డట్టుగానే ముఖం సంతుష్టి సూచించింది.

లారీలోని సామాను నౌకర్లు ఒక్కొక్కటే దింపి హాల్లో పెట్టుతున్నారు. భద్రంగా దింపవలసిందని వరాండాలో నిలబడి నోటిలో 'స్మోకింగ్ పైప్' పెట్టుకొని నౌకర్లను హెచ్చరిస్తున్నాడు — హాతీసింగు.

"నా ఉత్తరం అందిందా?" అని భార్య నడిగాడు.

"అందకేం. అన్ని ఉత్తరాలూ అందుతూనే ఉన్నవి." అని సమాధానం చెప్పింది భార్య.

"అబ్బాయి ఏడీ? —"

"ఇప్పుడే బజారులో ఏదో పని ఉన్నదంటూ వెళ్లేడు."

"నే నీరైలుకు వస్తానన్న సంగతి వాడికి తెలుసా ?—"

"అన్నీ తెలుసు—" అంటూ లోపలికి చక్కా వెళ్లింది రాణి.

సామానంతా కిందికి చేరినతర్వాత హాతీసింగుకూడా లోపల ప్రవేశించి, పడక కుర్చీలో 'పైపు' పీలుస్తూ పండుకున్నాడు.

ప్లేటులో కాఫీ టిఫిన్ పెట్టుకొని వచ్చి ఎదుట బల్లమీద పెట్టింది — భార్య.

"అబ్బాయి వంట్లోనూ, నీ వంట్లోనూ ఆరోగ్యంగా ఉంటున్నదా ?—"

"ఆహా !—"

"వాడు బాగాచదువుకొంటున్నాడా?"

"అదే చదువు. ఎక్కడికి బాగూ, ఓగూను."

"ఈ సంవత్సరం ప్యాసవుతాడుగదా?"

"అదృష్టమనేది ఉంటే అవాలి మరి."

"డేరాడూన్ కాలేజీలో సీటు దొరికే ఏర్పాట్లన్నీ చేసివచ్చా! ఈ సంవత్సరం గనక ఈక్లాసు ప్యాసయితే పై సంవత్సరం వాణ్ణి మిలిటరీ కాలేజీకి పంపివేస్తా."

"ఆ మొఖానికి బాగుపడే రాత ఉండొద్దూ—"

"వాడికి ఉండకపోవడమేమిటి? తండ్రిని మించిన కొడుకవుతాడు చూడు —"

"ఏమో, వాడి కీ మిలిటరీసర్వీసు అంటే అంత ఇష్ట మున్నట్టు తోచదు."

"తోచక ఏమంటా డేమిటి ?"

"ఏముందీ అనడానికి. మీరు రాసే ఉత్తరాలన్నీ ఎప్పటికప్పుడు చూపెడుతూనే వున్నాను. కాని వాడితత్వమేమిటో, ఉలకడు, పలకడు—"

"వాడి ఉద్దేశమేమిటో ఒకసారి అడిగి తెలుసుకోలేకపోయావ్రా ?"

"సరే! వాడసలు చెప్పినమాట వింటున్నాడా ఏమిటి? ఒక్కగాక ఒక్క కొడుకయినందువల్ల, ఆడదాన్ని ఏమీ అనడానికి నాకు నోరాడకపోయె! తండ్రి అయిన మీరెక్కడో ఏడు సముద్రాల అవతల పరదేశంలో ఉండిపోతిరి. పసిపిల్లవాడు గనకనా! ఇచ్ఛారాజ్యం అయిపోయింది, వాడి వ్యవహారం—"

నెత్తిమీది పాగా తీసి టేబిలుమీద పెట్టి, కోటు విప్పుతూ—

"అల్లాగా—" అన్నాడు హాతీసింగు.

"అబ్బాయీ! పెద్దవాళ్లమాట కాస్త విను నాయనా! అంతదూర దేశంలో ఉద్యోగం చేసుకొంటూ తండ్రి అహర్నిశలూ నీమీద ప్రాణాలు పెట్టుకొని ఆరాటించిపోతున్నాడు. చెప్పినట్టు వింటే ని న్నెంతటివాణ్ణయినా చేయగల డాయన. నీ చదువేమో, నీ వ్యవహారమేమో, అంతే తప్ప రెండో వ్యాసంగానికి పోవద్దు నాయనా—అని శతపోరాను—"

"ఊఁ —" అని కనుబొమలు దగ్గర చేర్చాడు సింగు.

"నాన్ కోఆపరేషనూ, వల్లకాడూ— ఇట్లాంటి విపర్యాసాలు బయల్దేరి బంగారం వంటి కుటుంబాలని నాశనం చేసేస్తున్నవి.

ఏమో స్వరాజ్యమట, పికెటింగులట, ఖద్ద రట, కాష్టాలట — ఆ శని వీణ్ణిపట్టుకొని వేధించి వేస్తోంది. ఏమి చెప్పనూ—”.

“ఏమిటీ ? ” అని గ్రుడ్లు పెద్దవి చేసు కొంటున్నాడు సింగు.

“ఏమి ఏమిటి ? వాడేమో తుద నెగ్గించే మనిషిలా నాకు తోచలేదు. మరి మీరు మగవారూ, తండ్రులూ కాబట్టి, మీ కేమయినా లొంగుతాడేమోకాని, నా వల్లకాలేదు వాణ్ణి పట్టుకురావడానికి—”.

“మరి నా కిదివరకే ఈ సంగతులన్నీ ఎందుకు రాశావుకావూ?”

“ఏమని రాయ మంటారూ ? మన అబ్బాయి ఇంత ప్రయోజకు డయాడని మీకు రాయడానికీ, రాసి మీమనస్సుకి లేనిపోని సంకటం కలిగించడానికీ నా కిష్టం కాలేదుసుమండీ.”

“.......................”

“రా స్తేమట్టుకు, అంత దూర దేశంలో ఉన్న మీరుమాత్రం ఏమిచేయగలరు?”

“వా డింకా ఎంత సేపటికి వస్తాడూ ఇంటికీ ?”

“ఏమో ! వాడికి ఇల్లూ వాకిలీ కాబ ట్టిందా? మాలకాకి తిరిగినట్టు ఊరువెంట ఒక టేతిరగడం. వేళకి అన్నమైనా తినడం మానే శాడు. నాలుగుమెతుకులు నోటికి పోనివ్వడు. ఇవ్వేళ ఏమో ‘ఇండిపెండన్సు డే అట. బడికి పోకుండా పిల్లకాయలందరూ సమ్మెకట్టారట. బజారులో సీమగుడ్డలు కొనవద్దని బడిపిల్లలు పికెటింగు చేస్తారట. తెల్లవారకుండానే నిద్రమంచంమీదనుంచి లేచి వెళ్లాడు— ఏమని చెప్పనూ ?—”

“ఇండిపెండెన్సు డే ఏమిటీ ?”

“ఈ దేశానికి స్వరాజ్యం వచ్చిన రోజో, పోయినరోజో అటకాదూ ! నాకేం తెలుస్తాయీ, వీధిలో తలచూపని ఆడ దానికి—”

“స్వరాజ్యమా !—”

“అయ్యో ! మీరు వినలేదుకాబోలు! ఏళ్లతరబడి విదేశాల్లో తిరిగే మీ కేం తెలు స్తుం దీ గొడవ? ఈ ఆగడం ఆగడం కాదు. కల్లూ, సారాయీ మాన్పిస్తారట ! ఉప్పు తయారుచేస్తారట ! సీమగుడ్డలు లేకుండా చేస్తారట ! జైళ్లకు వెళ్లుతారట ! తెల్లదొర లని ఈదేశంలో ఉండకుండా తరిమివేస్తా రట ! ఏమి అల్లరి, ఏమి అల్లరి !”

“అబ్బో !—”

“కత్తులూ, కటార్లూ, యుద్ధాలూ, బాంబులూ — వీటితో పనేలేదట. ఏమిటో సత్యాగ్రహమట ! ఉపవాసాలట ! జైళ్లట— నే చెప్పలేను.”

“వీళ్ల కేమయినా బుద్ధి ఉంటుందా అను కొంటాను. ఎక్కడికి పోయాడు వీడూ ? మనిషిని పంపి ఒక్కసారి పిలిపించు తొంద రగా—”.

“ఎక్క డున్నాడని పిలిపించనూ. ఒరేయి ముసిలిగా ! కాంగ్రెసు ఆఫీసుదగ్గ రనో, ఎక్కడనో ఉంటాడుగాని అబ్బాయి గారిని, నాన్నగారు వచ్చా రని పిలుచు కొనిరా—” అని నౌకరును పంపింది రాణి.

పడకకుర్చీలో కాళ్లు చాచి పండు కొన్నాడు — సింగు.

"వస్తాడు గాని, వాణ్ణేమీ అనకండి. మళ్లా మీరంటే పిల్లి అయిపోతాడు. ఏదో కాస్త నయాన్నా, భయాన్నా మీరు చెప్పితే వింటాడు. వాడికోసర మేమయినా కొత్త వస్తువులు తెచ్చిపెట్టితే, వాటి నిచ్చి కాస్త సంతోష పెట్టండి వాణ్ణి."

"వాడికోసరం ఎన్ని తెచ్చానో చూపిస్తా చూడు –" అంటూ, తెచ్చిన ప్యాకెట్లన్నీ విప్పడం మొదలుపెట్టేడు సింగు. యుద్ధంలో ఉపయోగించే రకరకాల ఫిరంగులూ, బాంబులూ, ఏరోప్లేనులూ, ఇట్లాంటి ఆయుధాలు చూపించే బొమ్మలూ, భూమిమీదా, నీళ్లల్లోనూ, గాలిలోనూ యుద్ధంచేసే మహాయోధుల ఫోటోలూ, అబ్బాయికిగాను తెచ్చిన ఒక కొత్తరకం చిన్నసైజు రైఫిలూ, మిలిటరీసూటూ, హెల్మెట్టూ – ఇట్లాంటివి ఎన్నెన్నో, తెచ్చిన వన్నీ ఒక్కొక్కటే తీసి భార్యకు చూపెట్టుతున్నాడు — సింగు.

వాటిని చూచి,

"బొమ్మలూ, ఫోటోలూ చూస్తే జ్ఞాపకం వచ్చింది. ఒక్కసారి మేడమీదికి వెళ్లి అబ్బాయిగది చూచిరండి తెలుస్తుంది. ఇట్లాంటి ఫోటోలూ, బొమ్మలూ, వాడు చేత్తో తాకనయినా తాకుతాడా ?"

అంటూనే హాతీసింగూ, ఆమే మేడమీదికి వెళ్లేరు.

"ఏమి టీ ఫోటోలూ ? ఎవరివి ఇవీ ?"

"ఈ మహానుభావు లందరూ దేశనాయకులట ! అదిగో ఆబోసినోటి ఆయన్ని మీరు ఎరిగే ఉంటారుగదా !"

"ఆహా ! ఎరగ కేమీ ? పుట్టాడు, దేశాలు నాశనం చేయడానికి !—"

"ఇదిగో, ఈ బొమ్మ జవహారిలాలుదట. ఇది ఆయన తండ్రిగారిదట ! అదేమో బెంగాలీ ఆయనదట ! పేరు నాకు జ్ఞాపకం లేదు. అదిగో! ఆఫోటో పటేలనో, గిటేలనో చెప్పాడు. ఎవరికి జ్ఞాపకం ? అసలు నాకిష్టంలేక ఈ మేడమీదికి రావడమే మానేశాను."

"ఇంత ఘోరం జరుగుతున్నదని నాకు తెలియనే తెలియదుసుమా ! అయ్యయ్యో! ఇట్లాంటి ఫోటోలు, మన ఇంట్లోకి ఎందుకు రానిచ్చావు? కొంప మునుగుతుందే ?"

"నేను రానిచ్చే దేమిటి ? వాడు రానీయండి మీకే తెలుస్తుంది, వాడివాలకమూ, వైఖరీని. ఇదుగో! ఇట్లా వచ్చి ఈఫోటో చూడండి, మీ అబ్బాయి ఎంత బాగున్నాడో తెలుస్తుంది—"

"ఏమిటీ ! వీడు మనరాముడా ?"

"నెత్తిమీద ఆ ఖద్దరుటోపీ, ఆలాగూ ఆలాల్చీ, ఆ వెయిస్టుకోటూ – ఇట్లాంటి దరిద్రులికి ఐశ్వర్యాలు పట్టమంటే ఎట్లా పట్టుతవి ?"

అదివరదాకా ఏమో అనుకొని కొంత చులకనగా వింటూవచ్చాడు – హాతీసింగు. కాని, అబ్బాయిగదిలో అడుగుపెట్టేవరకతనికి పంచాగ్నులమధ్య నిలబడ్డట్టయింది. వ్యవహారం ముదరి తనచేతికి మించిపోయినట్టు అనిపించింది. తాను వేసుకొన్నప్లాను ఒక్కటికూడా తుదముట్టేటట్టు అతని కేమీ నమ్మకం కలగలేదు. అయిదేళ్లక్రిందట చూచిన పిల్లవాణ్ణే చూడాలని ఆతురపడ్డాడు.

కాని విషయాలన్నీ స్వయంగా చూచేవరకు, ఆతనికి కొడుకుమీద పట్టరాని ఆగ్రహం బయల్దేరి, శరీరం ముచ్చెమటలూ పోసింది. ఏది ఎట్లున్నా, మిలిటరీ ఉద్యోగి అయిన తనఇంట్లో ఆ ఫోటోలు ఉండడం మరీ ప్రమాదకరం! అబ్బాయివిషయం తర్వాత నిదానంగా ఆలోచించుకోవచ్చునని, మేడమీది గదిలో ఫోటోలన్నీ ఒక్కొక్కటే తీసి, కింద రహస్యంగా దాచిపెట్టాడు.

కొడుకుని చూడాలని ఆరంభంలో కలిగిన ఆ ప్రేమా, ఆ ఆతురతా ఆగ్రహంలోకీ, ఆగ్రహంలోనుంచి క్రమంగా భయంలోకీ దిగింది సింగుకు.

కాని, తానెంత గొప్ప మిలిటరీ యోధుడయితేమాత్రం ఏమిచేయగలడు? తన ప్రతాపం, ఇంటిదగ్గర భార్యాసుతులవిషయంలో పనికిరాకుండా పోయింది. రామసింగయినా సమక్షంలో ఉంటే ఆ ఉద్రేకంమీద నోటికి వచ్చిన ఇన్నితిట్లు తిట్టడమో, లేక, అతగాడి చెంపలు వాయా నాలుగు అంటించడమో, ఏదో శిక్ష విధించి కొంత మనశ్శాంతి కలిగించుకొనేవాడు —— కాని దానికిన్ని అవకాశం లేకుండా పోయింది.

భర్త వైఖరి చూచేవరకు రాణికీ భయం ఆరంభించింది. ఆయన స్వయంగా వచ్చినప్పుడయినా, జరిగినవిషయాలు జరిగినట్టు ఆయనకి చెప్పకుండా దాచిపెట్టడానికి ఆమెకెట్లా వీలూ?

అటు భర్తా, ఇటు భార్యా తెల్లబోయి కొయ్యబొమ్మల్లా నిలబడిపోయారు.

ఇంతలో అబ్బాయి రామసింగుకోసరం పోయిన నౌకరు పరుగు పరుగున వచ్చి, "అమ్మా! అబ్బాయిగారికి పోలీసు కాల్పుల్లో దెబ్బలు తగిలినవి! నెత్తురు వరదలై పోతూంది. ఆస్పత్రికి తీసుకొనిపోయా" రని వర్తమానం చెప్పాడు.

రాణి నిలువునా, నరికిన చెట్టులాగా కూలిపోయింది. సింగు —— 'ఆఁ' అంటూ నిశ్చేష్టుడైపోయాడు.

"అయ్యో రామం!" అంటూ లేచి గొల్లుమన్నది తల్లి. వెంటనే మోటా రెక్కి—తల్లి తండ్రి ఆస్పత్రికి వెళ్లిపోయారు.

డ్రెస్సింగురూములో బల్లమీద మనస్మారకం లేకుండ పడిపోయి ఉన్నాడు రామసింగు.

"అయ్యో! నారక్తం నాకళ్లనే చూడవలసి వచ్చిందిరా నాయనా!" అని పిల్లవాడిమీద పడి గొల్లుమన్నది తల్లి. తండ్రి ఎన్నెన్నో మహాసంగ్రామాలు చూచిన వీరపురుషుడు, రణరంగంలో శత్రువుల హాతమార్చిన యోధుడు, తన తుపాకిబారుకి ఎన్నివందల జీవుల్నో బలిచేసిన రసపుత్రవీరుడు. ఎన్ని రక్తప్రవాహాలలోనో ఈదులాడి విహరించిన శూరుడు — హిమాలయపర్వతంవంటి ధైర్యస్థైర్యాలుగల అతని హృదయం, అతనిమనస్సు, అతని సమస్తావయవములూ ఆబాలుని ముఖంమీద స్రవించే రక్తచారికలు చూచి భరించలేక పోయినవి. కలకలలాడే ఆలేతముఖబింబాన్ని చూడలేకపోయాడు. తనని నిలువునా ముంచెత్తివేసే ఆ దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు——

తన పేగులో పేగు తనరక్తంలో రక్తం. తనహంశలో హంశ. రామసింగు పెరిగి పెద్దవాడయితే అతనిముఖకట్లు, మళ్లా మూడు మూర్తులా తండ్రి హాతీసింగే !

అయిదేళ్లక్రింద చూచినబిడ్డ ! అల్లారు ముద్దుగా పెంచుకొన్నబిడ్డ ! ఇంటికి రాగానే కరవుతీరా అక్కున చేర్చుకొని ముద్దాడవలె నని కొండంత ఆశతో వచ్చిన ఆ తండ్రి భరించలేక పోయాడు—

" నాయనా ! ఒక్కసారి కళ్లు తెరచి చూడు—" అని వెర్రి ఆవేదనతో అరిచాడు—

డాక్టరు వచ్చి అతనినోరు గట్టిగా మూశాడు.

" అయ్యా ! డాక్టరుగారూ ! పిల్లవాడు మళ్లా మాకు దక్కుతాడా ?" అని అడిగాడు సింగు.

"మీరు తొందరచేయకండి . మరేమీ ఫరవాలేదు—" అన్నాడు డాక్టరు .

"గాయం బలమైన గాయమేనా?"

"లేత శరీరానికి ఎంతదెబ్బ కావాలి? అందులో తుపాకీదెబ్బ —" అన్నాడు డాక్టరు.

"నా నాయనకి తుపాకి గుండుదెబ్బ! కాపాడండి డాక్టరుగారూ!" అని తల్లి గోల చేసింది. ఇద్దరు కాంపౌండర్లు ఆమెనూ, హాతీసింగునూ బయట వెయిటింగు రూములోకి తీసుకొనిపోయారు. రామసింగుగది తలుపు లోపల గడియ బిగించాడు డాక్టరు.

"నా కొడుకు నంత దెబ్బకొట్టడానికి వాడు చేసిన పాప మేమిటి నాయనా ?—" అని బయట వరాండాలో నిలబడ్డ పోలీసు జవాన్ని అడిగింది తల్లి.

"చదువుకొనే పిల్లకాయల్ని అదుపు ఆజ్ఞల్లో ఉంచుకో లేక సర్కారుమీద ఉసి గొల్పితే ఊరుకొంటారా? సీమగుడ్డలంగళ్ల దగ్గర పికెటింగు చేయకూడ దని సర్కారు వారి ఉత్తర్వు లుండీకూడా, బజారులో జనం మూగి అల్లరి చేసేవరకు, పోలీసువాళ్లు తుపాకులు కాల్చారు. ఆ దెబ్బలో అందరికంటె ముందుగా ఉండిన ఈ పిల్లవాడికి మాత్రం బలమైనగాయం తగిలిం" దన్నాడు పోలీసు.

రాజపుత్రుడు హాతీసింగు. తిరగబడితే వందమందినయినా ఒక్కడూ హతమార్చగలడు. కాని సముద్రాలు దాటి, కొండలు దాటి, ద్వీపములు దాటి, విదేశభూములలో విలయతాండవమాడిన అతని ప్రతాపజ్యోతి, అతనిశౌర్యం తన లేతకొడుకు, ఒక్క పసిపిల్లవాని ఎదుట వెలవెల బోతోంది! బిగించబడిన గదితలుపుకు తల జేరవేసి ఒక వర్ణనాతీతమైన స్థితిలో పడిపోయినాడు, హాతీసింగు.

అంతలో సైకిలుమీద ఒక పోలీసు కాన్‌స్టేబిలు చేత కవ రొకటి పట్టుకొని, అక్కడికి వచ్చి,

" ఇక్కడ సరదారు హాతీసింగుగా రెవరండీ ?" అని అడిగాడు.

ఉలిక్కిపడి నేనే అన్నాడు సింగు.

కవరు తీసుకొని విప్పుకొన్నాడు—

" సరదారు హాతీసింగుకు—

"రామసింగు అనే మైనరుపిల్లవాడు నీ కుమారుడనీ, సీగార్డియన్‌షిప్పులో ఉన్నాడనీ మానోటీసుకు వచ్చింది. అతడు చట్టవిరుద్ధమైన సంఘాలలో చేరి ప్రజాశాంతికి భంగం కలుగచేస్తున్నాడు. కాబట్టి అతన్ని వెంటనే సీగార్డియన్‌షిప్పులోనుండి తొలగించి, అతనికి నీతోగల సంబంధం తెగ్గొట్టుకొని, ఆవైనం వెంటనే సర్కారుకు తెలియచేయవలెను".

అన్న గవర్నమెంటు ఉత్తర్వు చదువుకొన్నాడు.

అతనికాళ్లల్లో దడ బయల్దేరింది—

"నాయనా!" అని ఏడిచింది తల్లి.

గదితలుపు తెరచి, డాక్టరు అన్నాడు,

"పిల్లవాడికీ మీకూ సంబంధం తెగిపోయింది"అని.


చిరకాలమునుండి బాధించుచున్న మూత్రవ్యాధులకును శగ (గనేరియా) వ్యాధికిని క్రొత్తగా కనిపెట్టబడిన దివ్యౌషధము

# గోనోకిల్లర్ (రిజిస్టరుడ్)

కృత్రిమములు చూచి మోసపోకుడు. మందును ఖరీదు చేయునప్పుడు ప్యాకెటుపై గోనోకిల్లర్ పేరున్న, 'కోడి' మార్కు సీలునుగమనింపుడు.

ఇంగ్లీషుమందులను దేశీయఔషధములను పుచ్చుకొనినను గుణముకలుగనియెడలను, యింజక్షనులవలనను వాక్సినులవలననుగూడ లాభములేకపోయినయెడలను కడపటిప్రయత్నముగా మా గోనోకిల్లరునుగూడ పుచ్చుకొని చూడుడు. పెక్కుయేండ్లనుండియున్నను లేక క్రొత్తగా కలిగినను ఏరకము శగ సంకటమైనను మరెట్టి మూత్రవ్యాధులనైనను స్త్రీలకైనను పురుషులకైనను గోనోకిల్లరు తప్పక కుదుర్చును. మూత్రము ఝారీగా వెడలును. మూత్రముపోవుచున్నపుడు కలుగుమంట తగ్గిపోవును. మూత్రనాళమునందలి వాపుతీసిపోవును. శగవ్యాధి (గోనోకొకసు)వలన మూత్రము బొట్లుగాపడుట, మేహరోగమువలన మూత్రద్వారమునుండిపోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు, మూత్రద్వారముయొక్క చుట్టువుండు పోకయొక్క వాపు, మూత్రాశయముయొక్క వాపు లేక మూత్రతిత్తియొక్క వాపు, నరములజబ్బు, మున్నగువ్యాధులన్నియును స్త్రీలకును పురుషులకును గూడ గోనోకిల్లరువలన కుదురును. వీర్యము (సెమను)పోవుట, మూత్రవ్యాధులు మున్నగునవిగూడ దీనివలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3-0-0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు. మా పుంజుమార్కు గమనింపుడు. వీ. పి. చార్జీ ప్రత్యేకము.

అడ్రసు:—డాక్టరు డి. యన్. జసాని, గిర్‌గాను వెనుకరోడ్డు, బొంబాయి 4.

**Dr. D. N. JASANI, Girgaon Back Road, Bo mbay, 4.**

*Madras Agents*:—DADHA & Co., 52, Nainiappa Naick St., P. T. Madra